నాణ్యమైన వస్తువుకే పెద్దపీట

జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన సదస్సులో వక్తలు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ సిల్వర్‌జూబ్లీ సెమినార్ హాలులో శనివారం డైరెక్టరేట్ ఆఫ్ ఇంటర్ ప్యూనర్‌షిప్ విభాగ అధిపతి డా. శ్రీదేవి ఆధ్వర్యంలో ఒక రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సును యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో ఇప్పుడు అనేక మార్పులు వస్తున్న తరుణంలో కొనుగోలుదారుడు తను కొనుగోలు చేసే వస్తువు నాణ్యమైనదే కావాలని కోరుకుంటున్నారన్నారు. డబ్బుకు తగ్గ వస్తువు తన చేతికి వచ్చిన తరువాత తానే మౌత్ ప్రమోట్ చేసే పరిస్థితి ప్రస్తుతం ఏర్పడిందన్నారు. శాంత బయోటిక్ అధినేత డా. వర ప్రసాద్ రెడ్డి 35 సంవత్సరాల క్రితం ఎంతో శ్రమపడి ఎటువంటి సౌకర్యాలు లేని ఆ సమయంలో అవమానాలు భరించి చివరకు అత్యంత విలువైన వ్యాక్సిన్ తయారు చేశారన్నారు. బ్యాంకు వారు పెట్టుబడికి ముందుకు రాకపోవటంతో, ఆయన తన విజన్‌ను ముందుకు తీసుకుపోవాలన్న సంకల్పం ముందు ఏది ఆగలేదన్నారు. ఆలీవ్ సంస్థ ఉపాధ్యక్షురాలు డా. జ్యోతి కొత్తగా వ్యాపారం చేసే వారికి ఆలీవ్ శిక్షణ ఇస్తుందన్నారు. దాదాపు 40 వేల మంది పనిచేస్తున్నారన్నారు. జూట్ బ్యాగ్ తయారీలో ఇతర వస్తువుల తయారు చేయటంతో అనుభవం ఉన్నవారితో శిక్షణ ఇప్పిస్తారన్నారు. మహిళలకు మెలకువలు నేర్పి వారిని వ్యాపార రంగంలో నిలబడేలా చేస్తున్నామన్నారు. ప్రగతి నగర్‌లోని ఆలివ్ సంస్థలో ప్రస్తుతం టీ కప్పు నుంచి అనేక వస్తువుల తయారు చేయటం జరుగుతోందన్నారు. యూనివర్సిటి రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అందరికి ఉద్యోగ అవకాశం దొరకడం నేటి పరిస్థితిలో చాలా కష్టమని, యువత నిరుత్సాహ పడకుండా కొత్త ఆలోచనతో వ్యాపార రంగాన్ని ఎంచుకొని ఇతరులకు ఉపాది కల్పించవచ్చన్నారు. డైరెక్టర్ డా. ఆర్. శ్రీదేవి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులను నిర్వహించటం వల్ల ఒకరి ఆలోచన మరొకరు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యాపారాభివృద్ధికి ఇలాంటి సదస్సులు ఎంతగానో కొత్తగా వ్యాపార రంగంలోకి వచ్చే వారికి ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్, బ్యాంక్ మేనేజర్, చిన్న తరహా పరిశ్రమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాదచారి రోడ్డు దాటేదెలా?



రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్న పాదచారులు..



చింతల్‌లో పెలికాన్ సిగ్నల్స్ వెలగని దృశ్యం..

రంగారెడ్డినగర్: పాదాచారులు సురక్షితంగా రోడ్లు దాటేందుకు పలు ప్రధాన రోడ్లు వెంబడి రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పిలియన్ సిగ్నల్స్ మూణ్ణాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి.. చాలా ప్రాంతాల్లో సిగ్నల్స్ పని చేయకపోవడంతో రోడ్లు దాటేందుకు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని ఐడీపీఎల్ నుండి సూరారం వరకు పలు ప్రాంతాల్లో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పిలియన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అయితే చింతల్ ప్రధాన రోడ్డులోని హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న పిలియన్ సిగ్నల్స్ పని చేయడం లేదు. అసలు నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డును దాటేందుకు పాదాచారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిలియన్ సిగ్నల్స్ పని చేసేలా మరమ్మతులు నిర్వహించి పాదాచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిభ చూపిన శ్రీచైతన్య విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు..

కుత్బుల్లాపూర్: అమెరికా నాసా నిర్వహించిన ప్రపంచ స్పేస్ ప్రయోగ పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ కొంపల్లి-5 విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎన్ఎస్ఎస్ నేషనల్ స్పేస్ సెటిల్‌మెంట్ స్పేస్ కాలనీలో 8వ తరగతి విద్యార్థిని పి.యషిక వ్యక్తిగత ప్రాజెక్ట్ విభాగంలో మొరింగా ప్రాజెక్ట్ ద్వారా ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. అదే విధంగా గ్రూపు ప్రాజెక్ట్ విభాగంలో ఆఫ్రికట్ ప్రాజెక్ట్ ద్వారా 8వ తరగతిలో వై.లహరి, డి.సాయిశ్రీకర్ రెడ్డి, పిషాబిత్, అభినవ్ కృష్ణలు విజేతలుగా నిలిచారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జోన్ ఏజీఎం రమణారావు, జోనల్ కో-ఆర్డినేటర్లు రవికుమార్, జైపాల్‌రెడ్డి, సీతారామ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, డీన్ గోవింద్, నాసా ఇంచార్జి పద్మజ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందికి వివరాలు అందజేయాలి



శ్రీనాథ్‌రెడ్డి..

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా పరిధిలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు తమ వివరాలను విద్యుత్ శాఖ సిబ్బందికి అందజేయాలని మేడ్చల్ డివిజన్ డిఈ శ్రీనాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో చేసుకున్న దరఖాస్తులను తమ సిబ్బంది పరిశీలిస్తున్నారని, ప్రజాపాలన దరఖాస్తు రసీదుతో పాటు ఆహార భద్రత కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు నెంబర్లను సిబ్బందికి అందజేయాలన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట, కొంపల్లి, పేట్‌బషీరాబాద్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, అలియాబాద్, శామీర్‌పేట్ సెక్షన్ల పరిధిలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇంటింటికి వచ్చే మీటరు రీడర్లకు తమ పూర్తి వివరాలను అందించి సహకరించాలని కోరారు.

ఎలక్షన్ సెల్ ఇంచార్జిలు వీరే..

కుత్బుల్లాపూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికలు సజావుగా జరిగేందుకు మేడ్చల్ డీసీపీ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్ల వారీగా ఎలక్షన్ సెల్ ఇంచార్జిలను నియమించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి (మేడ్చల్ పీఎస్), ఎస్ఐపీ సురేందర్‌రెడ్డి (పేట్‌బషీరాబాద్ పీఎస్), ఏఎస్ఐ కిషన్ (సూరారం పీఎస్) , కానిస్టేబుల్ పి.బాబు (జీనోమ్ వ్యాలీ), కానిస్టేబుల్ వెంకటేశ్(మేడ్చల్ పీఎస్), కానిస్టేబుల్ మక్తార్(ఆల్వాల్), కానిస్టేబుల్ సాయికుమార్ (శామీర్‌పేట్), కానిస్టేబుళ్లు నవీన్, ప్రసాద్ (ఏసీపీ కార్యాలయం పేట్‌బషీరాబాద్), కానిస్టేబుళ్లు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్ (ఏసీపీ కార్యాలయం పేట్‌బషీరాబాద్), ఎస్ఐపీ రామ్ నారాయణ, కానిస్టేబుళ్లు మహేష్, విజయ్ (పేట్‌బషీరాబాద్ పీఎస్), ఎస్ఐపీ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు రాజు, సాగర్ (శామీర్‌పేట్ పీఎస్), ఎస్ఐపీ సురేష్, ఏఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు ఉమామహేశ్వర్, ఈశ్వర్ (ఆల్వాల్ పీఎస్), ఎస్ఐపీ నవీన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు అభిషేక్, రంజిత్ (మేడ్చల్ పీఎస్), ఎస్ఐపీ రాజేష్, కానిస్టేబుళ్లు గణేష్‌కుమార్, శ్రవణ్ కుమార్ (దుండిగల్ పీఎస్), ఎస్ఐపీ నారాయణ్ సింగ్, వెంకటరమణ, సైదులు (సూరారం పీఎస్), హెడ్‌కానిస్టేబుల్ జంగయ్య, కానిస్టేబుళ్లు నాగరాజు, సుమన్ (జీనోమ్ వ్యాలీ పీఎస్).

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయు నాయకులు

నిజాంపేట్: బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఫిబ్రవరి 16 జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు మేడ్చల్‌జిల్లా నాయకులు చంద్రశేఖర్, బాలపీరు అన్నారు. శనివారం బాచుపల్లిలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, కిసాన్ మోర్చా సంయుక్తంగా అఖిల భారత స్థాయిలో సమ్మె చేపట్టాలని నిర్ణయించారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారానికి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా రైతాంగం, కార్మిక వర్గాల పరిష్కరించడం లేదన్నారు. సమావేశంలో నాయకులు మాణిక్యం, ప్రవీణ్, యాదగిరి, ఆనందరావు, రాంబాబు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తుల స్వీకరణ



ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపాలిటీలోని వార్డులో శనివారం నిర్వహించారు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా 16వ వార్డులో రూ.500లకు వంట గ్యాస్ కోసం, 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లబ్ధిదారుల ఎంపిక కోసం 10వ వార్డులో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ శశికళతో కలిసి ప్రజా పాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవేందర్‌ముదిరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

మోతీనగర్: ఖార్డు స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం మూసాపేట కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. మూసాపేట డివిజన్ అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా ఔషధాల తయారీ ముడిసరుకు విక్రయాలు

భాగ్యనగర్‌కాలనీ: ఎటువంటి బిల్లులు లేకుండా ఔషధాల తయారీకి ఉపయోగించే ముడి సరుకులు విక్రయిస్తున్న ఇద్దరు పై చర్యలు తీసుకోవాలని కేపీహెచ్‌బీ పోలీసులు కూకట్‌పల్లి కమర్షియల్ టాక్స్ అధికారికి ఫిర్యాదు చేశారు. సీఐ వెంకన్న తెలిపిన మేరకు.. శుక్రవారం సాయంత్రం కేపీహెచ్‌బీ ఎస్ఐ సత్యకుమార్‌విధులు నిర్వహిస్తున్న సమయంలో కేపీహెచ్‌బీ 3వ ఫేజ్ టెంపుల్ బస్‌స్టాప్‌లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఔషధాల తయారీ ముడి సరుకు విక్రయిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా శ్రీధర్ రెడ్డి (50), కొండేటి భరత్ (30)లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఔషధాల తయారీకి ఉపయోగించే ముడిసరుకు సెటాగ్లిప్టన్ 170 కిలోలు, టెల్మిసర్టాన్ 25 కిలోలు, నార్ ఫ్లాక్సిన్ 3 కిలోలు, లీసార్టన్ పొటాషియం 3 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. ముడిసరుకుకు చెందిన బిల్లులు చూపించాలని ప్రశ్నించగా, తమ వద్ద ఎటువంటి బిల్లు లేవని, జీఎస్టి టాక్స్ తప్పించేందుకే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విచారణలో పేర్కొన్నారు. వారి వద్ద ఉన్న సరకు స్వాధీనం చేసుకున్న పోలీసులు కూకట్‌పల్లి కమర్షియల్ టాక్స్ అధికారి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు సీఐ వెంకన్న తెలిపారు.

రథసప్తమి సందర్భంగా 16న ఉచిత యోగా శిక్షణ

సుభాష్‌నగర్: ఈనెల 16న రథసప్తమిని పురస్కరించుకొని ఉచిత యోగ శిక్షణ ఇవ్వనున్నట్లు యోగ గురువు రవీందర్ రాజు అన్నారు. శివోహం యోగ రీసర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో సుచిత్రలోని టిఎస్ ఆర్ మాల్ వెనుక క్లబ్ హౌస్‌లో సోమవారం నుండి శుక్రవారం వరకు ఉచిత యోగ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 93963 78418 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

నగరవాసులను అలరించనున్న బాంబే సర్కస్

కుత్బుల్లాపూర్: ఏషియాలోనే అతిపెద్దదైన గ్రేట్ బాంబే సర్కస్ 30 సంవత్సరాల తరువాత హైదరాబాద్ నగరవాసులను అలరించేందుకు కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభించినట్లు నిర్వాహకులుతెలిపారు. సర్కస్ ప్రత్యేకతలను మేనేజర్లు కృష్ణ, వెంకట్‌రెడ్డి, ఇలియాజ్‌ఖాన్‌లు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4గంటలకు తిరిగి రాత్రి 7గంటలకు ప్రత్యేక షోలు ఉంటాయన్నారు. ఈ సర్కస్‌లో ప్రత్యేకంగా 60 అడుగుల ఎత్తులో గాలిలో ఫ్లయింగ్ ట్రాఫీస్ హైలెట్‌గా నిలవనుందన్నారు.

డైరీ ఆవిష్కరణ

నిజాంపేట్: సామాజిక ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని నింపడంతో పాటు ప్రతిఘటించే శక్తిని పెంపొందించడానికి కేవీపీఎస్ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలపీరు అన్నారు. శనివారం కేవీపీఎస్ -2024 డైరీని నిజాంపేట్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదిక ఛైర్మన్ మేకల నగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, కుల వివక్షతకు వ్యతిరేకంగా తమ జీవితాంతం పోరాడిన మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ ముందుకు సాగడం అభినందనీయమన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 7,12,759కు పెరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గత నెల 7 నుండి 22వ తేదీ వరకు నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ నమోదుకు అధికారులు చర్యలు చేపట్టారు. 2024 జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారికి అవకాశం కల్పించగా కొత్తగా 13,629 మంది ఓటర్లుగా నమోదయ్యారు. దీంతో 2023లో రాష్ట్ర 6,99,130గా ఉన్న ఓటర్లు తాజాగా కొత్తగా నమోదైన ఓటర్లతో కలిపి 7,12,759 మంది అయ్యారు. వీరిలో పురుషులు 3,66,707, మహిళలు 3,32, 264, ఇతరులు 159 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఫారమ్-6 దరఖాస్తులు 4118, ఫారమ్-7 ధరఖాస్తులు 4250, ఫారమ్-8 దరఖాస్తులు 2227 వచ్చాయి. వీటన్నింటిని సమగ్రంగా పరిశీలించిన ఎన్నికల అధికారులు తుది జాబితాలో కొత్తగా 13,629 మంది పేర్లను చేర్చారు.

మేడారానికి బస్సులు నడపాలి



భట్టి విక్రమార్కను కలిసిన ఐలయ్యగౌడ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాల నుంచి మేడారం సమ్మక్క సారక్క జాతరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసి వినతి పత్రం అందజేశారు. ఐలయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, సబ్బండ వర్గాలు అధికంగా ఉన్నారని, వారి ఆరాధ్య దైవమైన సమ్మక్క సారక్క లను దర్శించుకునే భాగ్యం కల్పించాలని. ప్రత్యేకంగా బస్సులను నడపాలని కోరారు. మాజీ కౌన్సిలర్ వరమ్మ, రాజు, శ్రీనివాస్ గౌడ్ యాదగిరి పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ జాతర ప్రారంభం



ఆలయంలో కొలువైన కట్టమైసమ్మ..

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుక ఎల్లమ్మ జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ట, హోమము, కళ్యాణము, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు జరిగింది. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జరగనున్న ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ పేర్కొంది.

క్షణికావేశంలో బలవన్మరణం

వేర్వేరుచోట్ల ముగ్గురు ఆత్మహత్య



నిఖిల్‌కుమార్(ఫైల్)

దుండిగల్: ప్రేమ విఫలమై ఓ యువకుడు.. లోన్ యాప్ ద్వారా అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులతో మరో యువకుడు.. భార్యతో గొడవపడి ఓ మద్యం మత్తులో ఓ రౌడీషీటర్.. ఒకే రోజు మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం తాలేమ గ్రామానికి చెందిన ఆంజనేయులు తన కుటుంబంతో కలిసి నగరానికి వలస వచ్చాడు. బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో నివాసమంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతని కుమారుడు నిఖిల్‌కుమార్(22) ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడే అలవాటు ఉన్న నిఖిల్ లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. తిరిగి అప్పులు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 9న సాయంత్రం నిఖిల్ ఎలుకల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

భార్యతో గొడవపడి..



రాజేశ్‌నాయక్ (ఫైల్)

మద్యం మత్తులో భార్యతో గొడవ పడిన ఓ రౌడీషీటర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దుండిగల్ తాండా-1కు చెందిన హరిసింగ్ నాయక్ కుమారుడు రాజేశ్‌నాయక్(38) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతను తన భార్య స్వప్న, ఇద్దరు పిల్లతో కలిసి మల్లంపేటలోని అక్షయ కాలనీలో నివాసముంటున్నాడు. మద్యం మత్తులో రాజేశ్ నాయక్ తరుచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో 9వ తేదిన రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన రాజేశ్ భార్యతో గొడవ పడ్డాడు. వెంటనే క్షణికావేశంలో తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తలుపు తెరవకపోవడంతో పడుకుని ఉంటాడని భావించి స్వప్న పడుకుంది. శనివారం ఉదయం కూడా తలుపులు తెరవకపోవడంతో స్థానికుల సహాయంలో తలుపులు బద్దలు కొట్టి చూడగా వేలాడుతూ కనిపించాడు.

ప్రేమ పేరుతో యువతి మోసం చేసిందని..

దుండిగల్: ప్రేమ పేరుతో ఓ యువతి మోసం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డి.పోచంపల్లి 60 గజాల్లో సలీమ్ ఇంట్లో బిహార్ రాష్ట్రానికి చెందిన సోను, కిషన్ అనే ఇద్దరు అద్దెకు ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. బిహార్‌కు చెందిన దేవేష్‌కుమార్(22) నెల రోజుల క్రితం నగరానికి వచ్చాడు. సోను, కిషన్‌ల గదిలోనే ఉంటూ వారితోనే కూలీ పనులు చేస్తున్నాడు. ఈ నెల 9వ తేదిన గదిలో ఎవరు లేని సమయంలో టవల్‌తో రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒక అమ్మాయి తనను ప్రేమ పేరుతో మోసం చేసిందని, అందుకే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు ఓ లేఖ రాశాడు. ఇంటి యజమాని సలీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.